మంగళవారం అర్ధరాత్రి తర్వాత 'ఆపరేషన్ సిందూర్' పేరిట భారత సైన్యం చేసిన మెరుపుదాడిలో ధ్వంసమైన ముజఫరాబాద్‌లోని ఉగ్రవాదుల స్థావరాలు

పహల్గాంకు ప్రతీకారం.. పరాక్రమ సిందూరం

- 80 మంది ఉగ్రవాదులు హతం!
- మృతుల్లో జైషే చీఫ్ కుటుంబ సభ్యులు
- 25 నిమిషాల్లో 24 స్టైక్స్‌తో తొమ్మిది ఉగ్రవాద క్యాంపులు నేలమట్టం
- 1971 తర్వాత భారత త్రివిధ దళాలు చేపట్టిన జాయింట్ ఆపరేషన్ ఇదే
- ఎల్వోసీలో పాక్ రేంజర్ల కాల్పులు
- 13 మంది భారత పౌరులు మృతి.. 50 మందికిపైగా గాయాలు

పాక్, పీవోకేలోని 9 ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం మెరుపుదాడి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): పహల్గాం ఉగ్రదాడిలో భారత ఆడపడుచుల సిందూరాన్ని తుడిచేసిన ముష్కర మూకలకు 'ఆపరేషన్ సిందూర్' పేరిట భారత సైన్యం గట్టిగా బదులిచ్చింది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లోని తొమ్మిది ఉగ్ర శిబిరాలపై అత్యంత కచ్చితత్వంతో మెరుపు దాడులు చేసింది. అంతర్జాతీయ సరిహద్దుకు 100 కిలోమీటర్ల లోపు దూరంలో జరిగిన ఈ దాడుల్లో 80 మంది వరకూ ఉగ్రవాదులు హతమవ్వగా, మరో 60 మందికి తీవ్ర గాయాలైనట్టు సమాచారం. 1971 యుద్ధం తర్వాత త్రివిధ దళాలు సంయుక్తంగా నిర్వహించిన అతిపెద్ద జాయింట్ ఆపరేషన్ ఇదే. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను బుధవారం విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, కర్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌తో కలిసి మీడియా సమావేశంలో వెల్లడించారు. కాగా ఉగ్ర మూకలకు భారత్ గుణపాఠం చెప్పాయని యావత్తు ప్రజానీకం ముక్తకంఠంతో నినదించింది. ఈ దాడులతో తమకు న్యాయం జరిగిందని పహల్గాం బాధిత కుటుంబాలు వెల్లడించాయి. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై పలు దేశాధినేతలతో పాటు ప్రముఖులు కూడా హర్షం వ్యక్తం చేశారు. ఈ ఆపరేషన్‌పై అంతర్జాతీయ మీడియా కూడా విస్తృతమైన కవరేజీ ఇచ్చింది. మరోవైపు, నియంత్రణ రేఖ (ఎల్వోసీ) వెంబడి పాక్ రేంజర్లు బుధవారం కూడా కాల్పులకు తెగబడ్డారు. ఈ కాల్పుల్లో 13 మంది భారత పౌరులు మృతి చెందగా.. 50 మందికిపైగా గాయపడినట్టు ఆర్మీ వెల్లడించింది.

పాకిస్థాన్‌లోని మురిద్కేలో భారత సైన్యం దాడి చేసిన ఉగ్రవాద స్థావరంలో చెలరేగుతున్న మంటలు

దేశవ్యాప్తంగా హైఅలర్ట్

ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో జమ్ము, శ్రీనగర్, ధర్మశాల, లేహ్, అమృత్‌సర్ సహా దేశవ్యాప్తంగా 18 విమానాశ్రయాలను మూసివేశారు. 200కు పైగా విమానాలను రద్దు చేశారు. యూపీలో రెడ్ అలర్ట్ ప్రకటించారు. సరిహద్దు రాష్ట్రాల సీఎంలతో బుధవారం అమిత్‌షా అత్యవసర భేటీ నిర్వహించారు. సెలవుల్లో ఉన్న పారామిలిటరీ బలగాలను వెనక్కిరమ్మని ఆయన ఆదేశించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసిన ప్రధాని మోదీ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అంతకుముందు జరిగిన క్యాబినెట్ భేటీలో మాట్లాడిన ప్రధాని.. ఆపరేషన్ సిందూర్‌పై స్పందిస్తూ మనందరం ఇది గర్వించదగ్గ క్షణమని పేర్కొన్నారు. దాడుల నేపథ్యంలో ప్రధాని విదేశీ పర్యటనలు రద్దయ్యాయి. మరోవైపు, పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్సు సహా పలు ప్రాంతాల్లో స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. మెడికల్ ఎమర్జెన్సీ విధించారు. సైన్యానికి సెలవులు రద్దు చేశారు. కర్తార్‌పూర్ కారిడార్‌తో పాటు ఎయిర్‌పోర్టులు, రైల్వేస్టేషన్లను మూసివేశారు. పాక్‌లోని భారత రాయబారికి అక్కడి ప్రభుత్వం సమన్లు జారీ చేసింది.

25 మినిట్స్.. 9 క్యాంప్స్.. 24 స్ట్రైక్స్..

పహల్గాం దాడికి కారణమైన ఉగ్రమూకలను మట్టుబెట్టడమే లక్ష్యంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' పేరిట మెరుపు దాడులు జరిపింది. మంగళవారం అర్ధరాత్రి 1.05 గంటల నుంచి 1.30 గంటల వరకూ 25 నిమిషాల పాటు కొనసాగిన 24 క్షిపణి, ఆత్మాహుతి డ్రోన్ దాడుల్లో పాకిస్థాన్‌లోని నాలుగు ఉగ్ర శిబిరాలు, పీవోకేలోని ఐదు ఉగ్ర స్థావరాలు తునాతునకలయ్యాయి. ఈ దాడుల్లో జైషే మహమ్మద్ (జేఈఎమ్)కు చెందిన నాలుగు ఉగ్రవాద శిబిరాలు, లష్కరే తాయిబాకు చెందిన 3 స్థావరాలు, హిజ్బుల్లాకు చెందిన రెండు ఉగ్ర శిబిరాలు ధ్వంసమైనట్టు ఆర్మీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ దాడుల్లో జేఈఎమ్ చీఫ్ మౌలానా మసూద్ కుటుంబానికి చెందిన పది మందితో పాటు నలుగురు సన్నిహితులు కూడా హతమయ్యారు. ఈ విషయాన్ని అజార్ కూడా ధ్రువపర్చారు. ఈ దాడుల్లోనే ఎల్ ఈటీ చీఫ్ హఫీజ్ సయీద్ కుమారుడు తల్హా సయీద్ కూడా హతమయ్యాడంటూ వార్తలు వచ్చాయి. కాగా ఈ దాడులు యుద్ధ చర్యేనని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అన్నారు. గట్టిగా బదులిస్తామని తెలిపారు.

అలా చేస్తే మరింత తీవ్రంగా..

ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా ఉగ్ర శిబిరాలనే ధ్వంసం చేశామని, పాక్ ఆర్థిక, సైనిక స్థావరాలపై దాడి చేయలేదని భారత జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోవల్ తెలిపారు. ఉద్రిక్తతలను పెంచే ఉద్దేశం తమకు ఏమాత్రం లేదన్న ఆయన.. పరిస్థితులను తీవ్రం చేసేలా పాక్ వ్యవహరిస్తే.. భారత్ నుంచి ప్రతిస్పందన మరింత గట్టిగా ఉంటుందని హెచ్చరించారు. అమెరికా, బ్రిటన్, సౌదీ అరేబియా, జపాన్, రష్యా, ఫ్రాన్స్ దేశాల భద్రతా సలహాదారులు, కార్యదర్శులకు ఆయన సమగ్రంగా వివరించారు. కేంద్రం గురువారం అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చింది.

మనందరం గర్వించదగ్గ క్షణం

భద్రతా దళాల చర్యపై ప్రధాని ప్రశంసలు

న్యూఢిల్లీ, మే 7: పాకిస్థాన్, పీవోకేలలోని ఉగ్ర స్థావరాలే లక్ష్యంగా భద్రతా దళాలు చేపట్టిన సైనిక చర్యపై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ చేపట్టిన కొద్ది గంటల్లోనే ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర క్యాబినెట్ సమావేశమైంది. సమావేశంలో ప్రధాని మోదీ సైనిక చర్యను కొనియాడారు. ఉగ్రవాదుల్ని మట్టుబెట్టడంపై కేంద్ర క్యాబినెట్ హర్షం వ్యక్తం చేసింది. అంతకుముందు, ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సంగతిని కేంద్ర క్యాబినెట్‌కు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలియజేశారు.

'ఆపరేషన్ సిందూర్' వివరాలను వెల్లడిస్తున్న విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, చిత్రంలో కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్

ఉగ్ర స్థావరాలే లక్ష్యంగా సైనిక దాడి

పౌరులను, సైనిక శిబిరాలను టార్గెట్ చేయలేదు • విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ • తొలిసారి మీడియా సమావేశంలో నారీ శక్తి

న్యూఢిల్లీ, మే 7: భవిష్యత్తులో ఉగ్రదాడులు జరగకుండా అడ్డుకునే లక్ష్యంతోనే పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలను భారత రక్షణ దళాలు కూల్చివేశాయని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ బుధవారం తెలిపారు. పహల్గాం ఉగ్రదాడికి భారత్ ప్రతీకారం తీర్చుకున్న కొన్ని గంటలకే విలేకరుల సమావేశంలో కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌తో కలిసి మాట్లాడిన ఆయన తన భూభాగంపైన ఉన్న ఉగ్రవాద స్థావరాలపై చర్యలు తీసుకునే ఉద్దేశం పాకిస్థాన్‌లో కనిపించని కారణంగానే పహల్గాం ఉగ్రదాడికి బాధ్యులైన వారిని శిక్షించాల్సిన అవసరం ఉందని భారత్ నిర్ణయించిందని చెప్పారు. నిఘా వర్గాల నుంచి అత్యంత కచ్చిత సమాచారంతోనే ఉగ్రవాద స్థావరాలపై భారత సేన దాడులు జరిపినట్లు తెలిపారు. కేవలం ఉగ్ర స్థావరాలపైనే దాడి జరిగిందని, పౌరులు, సైనిక శిబిరాలను లక్ష్యంగా చేసుకోలేదని స్పష్టం చేశారు. పాక్ సైన్యం మద్దతు గల ఉగ్ర శిబిరాలను సమూలంగా నాశనం చేస్తామని చెప్పారు.

కశ్మీరును దెబ్బతీసేందుకే..

జమ్ము కశ్మీరులో సాధారణ పరిస్థితులు నెలకొంటున్న వేళ దాన్ని దెబ్బతీసే ఉద్దేశంతోనే పహల్గాం ఉగ్రదాడి జరిగిందని మిస్రీ తెలిపారు. గత ఏడాది కశ్మీరు లోయను రికార్డు స్థాయిలో 2.30 కోట్ల మంది పర్యాటకులు సందర్శించారని, పర్యాటకమే ప్రధాన ఆదాయంగా ఉన్న కశ్మీరును ఆర్థికంగా దెబ్బతీసే ఉద్దేశంతో ఈ దాడి జరిగిందని ఆయన అన్నారు.

మహిళా అధికారుల వివరణ

సైన్యానికి చెందిన సిగ్నల్స్ కోర్‌కు చెందిన కర్నల్ సోఫియా ఖురేషి, వైమానిక దళానికి చెందిన హెలికాప్టర్ పైలట్ వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ ఆపరేషన్ సిందూర్‌లో గురిపెట్టిన ఉగ్ర స్థావరాల పేర్లు, వివరాలను విలేకరులకు వివరించారు. సోఫియా ఖురేషి హిందీలో మాట్లాడగా వ్యోమికా సింగ్ ఇంగ్లిష్‌లో వివరాలు వెల్లడించారు. మే 6-7 తేదీ మధ్య రాత్రి ఒంటి గంట నుంచి 1.30 గంటల వరకు భారతీయ సాయుధ దళాలు ఆపరేషన్ సిందూర్ నిర్వహించినట్లు కర్నల్ ఖురేషి తెలిపారు. ఏప్రిల్ 22న అమానుష పహల్గాం ఉగ్ర దాడి మృతులకు, వారి కుటుంబాలకు న్యాయం చేసేందుకు ఈ ఆపరేషన్ చేట్టినట్లు ఆమె వెల్లడించారు. స్క్రీన్‌పై కొన్ని దృశ్యాలు కనిపిస్తుండగా దాడి చేసిన ఉగ్రస్థావరాల వివరాలను ఆమె వివరించారు. ఈ ఆపరేషన్‌లో 9 ఉగ్ర శిబిరాలను లక్ష్యంగా చేసుకుని ధ్వంసం చేసినట్లు ఖురేషి తెలిపారు. గడచిన మూడు దశాబ్దాలలో పాకిస్థాన్‌లో నియామకం, శిక్షణ, లాంచ్ ప్యాడ్లతోసహా ఉగ్రవాదులకు సంబంధించిన మౌలిక సదుపాయాల నిర్మాణం జరిగిందని ఆమె చెప్పారు. వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ మాట్లాడుతూ కచ్చితత్వంతో కూడిన సామర్థ్యాలతో ఉగ్ర శిబిరాలపై దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఎంపిక చేసిన మందుగుండుతో అధునాతన టెక్నాలజీతో కూడిన ఆయుధాలను ఉగ్ర శిబిరాలపై ప్రయోగించడం జరిగిందని ఆమె వివరించారు. ప్రతి టార్గెట్ లక్ష్యం ఒక నిర్దిష్టమైన భవనాన్ని లేదా భవనాల సముదాయాన్ని ధ్వంసం చేయడమని ఆమె తెలిపారు. అన్ని లక్ష్యాలు విజయవంతంగా పూర్తయ్యాయని, భారతీయ సాయుధ దళాల ప్రొఫెషనలిజం ఆపరేషన్ సిందూర్ ప్రణాళిక, దాని అమలులో మరోసారి నిరూపితమైందని ఆమె చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌లో సైనిక స్థావరాలపై గురిపెట్టలేదని ఆమె స్పష్టం చేశారు. భారత్ తన జవాబు ఇవ్వడంలో చాలా సంయమనం పాటించిందని, అయితే ఉద్రిక్తతలు మరింత పెరిగితే పాకిస్థానీ దుస్సాహసాలను తిప్పికొట్టేందుకు భారత సాయుధ దళాలు పూర్తి సంసిద్ధంగా ఉన్నాయని ఆమె తెలిపారు.

మరిన్ని దాడులపై నిఘా సమాచారం

భారత్‌పై మరిన్ని దాడులు జరగవచ్చని పాకిస్థాన్‌లోని ఉగ్రవాద గ్రూపుల కదలికలపై కన్నేసిన తమ నిఘా వర్గాల నుంచి సమాచారం అందిందని మిస్రీ తెలిపారు. పాకిస్థాన్‌లోని, పాక్ ఆక్రమిత కశ్మీరులోని 9 ఉగ్ర స్థావరాలపై భారత రక్షణ దళాలు ఆపరేషన్ సిందూర్ పేరిట క్షిపణి దాడులు జరిపిన నేపథ్యంలో విదేశాంగ కార్యదర్శి విలేకరులతో మాట్లాడారు. ఉగ్రవాదులను నిరోధించి, నివారించే విషయమై తమపై ఒత్తిడి ఉందని ఆయన చెప్పారు. భారత్‌లోకి చొరబడేందుకు అవకాశం ఉన్న ఉగ్రవాదుల మౌలిక సౌకర్యాలను ధ్వంసం చేయడంపైనే భారత బలగాలు దృష్టి సారించాయని మిస్రీ తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి జరిగి రెండు వారాలు గడిచినా తన భూభాగంపైన, తన అధీనంలోని ప్రాంతంలో ఉన్న ఉగ్రవాద స్థావరాలకు వ్యతిరేకంగా పాకిస్థాన్ వైపు నుంచి ఎటువంటి ప్రతీకాత్మక చర్యలు కనపడలేదని ఆయన చెప్పారు. పహల్గాం దాడిని ప్రస్తావిస్తూ లష్కరే తాయిబాకు చెందిన పాకిస్థానీ, పాకిస్థాన్ శిక్షణ పొందిన ఉగ్రవాదులు భారతీయ పర్యాటకులపై దాడి చేసి 26 మందిని పొట్టనపెట్టుకున్నారని తెలిపారు. 2008 నవంబర్ 26న జరిగిన ముంబై ఉగ్ర దాడుల తర్వాత ఇంత భారీ సంఖ్యలో ఉగ్రదాడిలో పౌరులు మరణించడం ఇదే మొదటిసారని ఆయన చెప్పారు. పహల్గాం దాడిని అత్యంత పాశవిక, ఆటవిక చర్యగా ఆయన అభివర్ణించారు. తమ కుటుంబ సభ్యుల ముందే బాధితుల తలపై తుపాకీ పెట్టి కాల్చి చంపారని ఆయన చెప్పారు.

ఎవరీ సోఫియా, వ్యోమికా?

చరిత్రలో తొలిసారిగా మహిళా అధికారులతో మీడియా సమావేశం

న్యూఢిల్లీ, మే 7: మొట్టమొదటిసారి భారతదేశ చరిత్రలో ఓ భారీ సైనిక ఆపరేషన్ వివరాలు వెల్లడించేందుకు అధికారిక విలేకరుల సమావేశాన్ని ఇద్దరు మహిళా అధికారులు నిర్వహించారు. భారతీయ సైన్యానికి చెందిన కర్నల్ సోఫియా ఖురేషీ, భారతీయ వైమానిక దళానికి చెందిన వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఎక్కడా తడబాటు లేకుండా వారు చేసిన ప్రకటనలు ఉగ్రవాదంపై భారత్ దృఢ సంకల్పాన్ని మాత్రమే కాకుండా సాయుధ దళాల్లో నారీశక్తి పెంపును ప్రతిబింబించింది.

2016లో ది ఆసియన్ ప్లస్ మల్టీనేషనల్ ట్రెయినింగ్ ఎక్సర్‌సైజ్‌లో భారతీయ సైన్యానికి చెందిన ట్రైనింగ్ కంటింజెంట్ ఫోర్స్ 18కి సారథ్యం వహించిన తొలి మహిళా అధికారిగా సోఫియా ఖురేషీ చరిత్రలో నిలిచారు. ఇందులో పాల్గొన్న అన్ని దేశాలకు చెందిన సభ్యుల్లో 35 ఏళ్ల సోఫియా మాత్రమే ఏకైక మహిళా కంటింజెంట్ కమాండర్. ఆపరేషన్ సిందూర్ గురించి ఆమె మాట్లాడిన తీరు ఆమె నాయకత్వ లక్షణాలను ప్రస్ఫుటంగా వ్యక్తం చేసింది. 1990లో భారత సైన్యంలో చేరిన సోఫియా 3 దశాబ్దాలకు పైగా అసమాన ధైర్యసాహసాలు, రాజీపడని మనస్థత్వంతో సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2006లో కాంగో పీస్‌కీపింగ్ మిషన్‌లో ఆమె పాత్ర ప్రపంచ వేదికపై భారత ప్రతిష్టను ఇనుమడింపచేసింది.

వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ భారత వైమానిక దళంలో అనేక సాహసోపేత విధులు నిర్వర్తించారు. వైమానిక దళంలో గౌరవ ప్రదమైన స్థానంలో కొనసాగుతున్నారు. ఈశాన్య భారతంలో వరద సహాయక కార్యకలాపాల్లో అందించిన సేవలకు సిగ్నల్ ఆఫీసర్ ఇన్ చీఫ్ నుంచి ప్రశంసలు, అనేక పురస్కారాలు అందుకున్నారు. 2004లో వైమానిక దళంలో చేరిన ఆమె, హెలికాప్టర్ ఫ్లయింగ్‌లో విశిష్ట సేవలు అందించారు. చేతక్, చీతా హెలికాప్టర్లను నడిపిన ఆమె 2017లో వింగ్ కమాండర్ హోదాకు ఎదిగారు.

లోకం పోకడ



'ఆపరేషన్ సిందూర్'.. ఆ పేరు ఎందుకంటే?

న్యూఢిల్లీ, మే 7: యావత్ భారతావని 15 రోజులుగా ఎదురుచూస్తున్న రోజు రానే వచ్చింది. జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై దాడికి పాల్పడి 26 మంది అమాయకుల ప్రాణాలు తీసిన ఉగ్రవాదులపై భారత్ ప్రతీకారం తీర్చుకున్నది. ఆ ఉగ్రమూకలను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌పై మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో ప్రతిదాడికి దిగి పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)తోపాటు పాకిస్థాన్‌లోని 9 ఉగ్రవాద శిబిరాలను, వాటిలోని అనేక మంది ముష్కరులను తుదముట్టించింది. ఈ ఆపరేషన్‌కు 'సిందూర్' అని పేరు పెట్టడం వెనుక ప్రత్యేకమైన సంకేతం ఉన్నది. భారత సంప్రదాయం ప్రకారం వివాహితులైన హిందూ మహిళలు సిందూరం (కుంకుమ) ధరిస్తారు. గత నెల 22న దాడికి పాల్పడిన ఉగ్రవాదులు సేదతీరుతున్న పర్యాటకుల్లో, ముఖ్యంగా దంపతుల్లో పురుషులను వేరు చేసి, వారి మతం అడిగి మరీ కాల్చి చంపారు. ఉగ్రవాదులు టార్గెట్ చేసిన జంటల్లో అప్పటికి 6 రోజుల క్రితమే పెండ్లయిన నవదంపతులు లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ (నావికాదళ అధికారి), హిమాన్షి ఉన్నారు. వినయ్ మృతదేహం వద్ద హిమాన్షి రోదిస్తున్న చిత్రం యావత్తు దేశాన్ని కలచివేసింది. హిమాన్షితోపాటు ఉగ్రదాడిలో భర్తలను కోల్పోయిన ఇతర మహిళల ప్రతీకారానికి చిహ్నంగా మన ప్రతిదాడికి 'ఆపరేషన్ సిందూర్' అని నామకరణం చేశారు.

సంయమనంతో కూడిన సందేశం

ఆపరేషన్ సిందూర్‌పై ప్రపంచ మీడియా

న్యూఢిల్లీ : ఆపరేషన్ సిందూర్‌పై భారత్ చెప్తున్నదానినే చాలా విదేశీ పత్రికలు రాశాయి. ఇది దాడి కాదని, ఉగ్రవాద నిర్మూలన కోసం చేపట్టిన చర్య అని తెలిపాయి. ఈ ఆపరేషన్ వల్ల భారత్-పాక్ ఘర్షణల్లో తీవ్రత పెరిగిందని 'న్యూయార్క్ టైమ్స్' అభిప్రాయపడింది. భారత్ సంయమనంతో కూడిన సందేశాన్ని ఇచ్చిందని తెలిపింది. ఈ ఆపరేషన్ అత్యంత కచ్చితత్వంతో జరిగినట్టు పేర్కొంది. సైనిక టార్గెట్లపై దాడులు జరగలేదని వెల్లడించింది. సీఎన్ఎన్ కవరేజ్‌లో, భారత్ ఉపయోగించిన అత్యాధునిక ఆయుధాల గురించి వివరించింది. ముఖ్యంగా రాఫెల్ యుద్ధ విమానాలు, స్కాల్ప్ క్రూయిజ్ క్షిపణుల గురించి తెలిపింది. ఇది కేవలం ఉగ్రవాద స్థావరాలపైనే జరిగిన దాడి అని వెల్లడించింది. 'వాషింగ్టన్ పోస్ట్' హెడ్‌లైన్‌లో, 'లెక్కగట్టిన బల ప్రదర్శన' అని పేర్కొంది. బల ప్రదర్శన చేస్తూనే, పూర్తి స్థాయి యుద్ధంగా మారడాన్ని నివారించేందుకు కృషి చేస్తున్నట్లు భారత్ సంకేతాలు ఇచ్చిందని తెలిపింది. బీబీసీ రిపోర్టింగ్‌లో, 'బహవల్‌పూర్, ముర్‌డిక్కేలలోని ఉగ్రవాద స్థావరాలే కీలక లక్ష్యాలు' అని పేర్కొంది. తన ప్రజలను కాపాడుకునే హక్కు భారత్‌కు ఉందని తెలిపింది. 'గార్డియన్' హెడ్‌లైన్‌లో, 'వ్యూహాత్మక సహనం నశిస్తున్నదనే లెక్కగట్టిన సంకేతం' అని పేర్కొంది. 'అల్ జజీరా' పాకిస్థాన్‌కు సానుభూతిని చూపించింది. ఏబీసీ న్యూస్ ముఖ్యంగా భారత సైనిక శక్తి, సామర్థ్యాలు, విస్తృత భౌగోళిక రాజకీయ పర్యవసానాలపై దృష్టి పెట్టింది.

నా కలను సోదరి తీర్చింది

కర్నల్ సోఫియా సోదరి వెల్లడి

ముంబై, మే 7: సైనికాధికారి కావాలనుకున్న తన కలలు తన సోదరి ద్వారా నెరవేరాయని కర్నల్ సోఫియా ఖురేషీ కవల సోదరి షైనా సున్సారా అన్నారు. భారతీయ సైనిక కంటింజెట్‌కు సారథ్యం వహిస్తున్న తొలిమహిళా అధికారి సోఫియా ఖురేషి బుధవారం ఆపరేషన్ సిందూర్ వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించిన సందర్భంగా ముంబైలో సినిమా నిర్మాణ సంస్థను నిర్వహిస్తున్న షైనా తన సోదరి విజయగాథను మీడియాతో పంచుకున్నారు. తాను కూడా సోఫియాతో మాట్లాడానని, బాధ్యత గల ఓ అధికారిగా ఈ రోజు తెల్లవారుజామున (బుధవారం) ఏమి జరగనున్నదో ఒక్క మాట కూడా చెప్పలేదని ఆమె తెలిపారు.

సోఫియాను చూసి గర్విస్తున్నా

తల్లి హలీమా ఖురేషీ

వడోదర (గుజరాత్), మే 7: దేశం కోసం గొప్ప పని చేసినందుకు తన కుమార్తె సోఫియాను చూసి గర్విస్తున్నానని ఆమె తండ్రి తాజ్ మొహమ్మద్ ఖురేషి చెప్పారు. పాకిస్థాన్‌ను సర్వనాశనం చేయాలన్నారు. తన తాత, తండ్రి, తాను సైన్యంలో పనిచేశామని, ఇప్పుడు తన కుమార్తె కూడా సైన్యంలోనే ఉందని తెలిపారు. సోఫియా తల్లి హలీమా ఖురేషి కూడా తన కుమార్తెను చూసి గర్వపడుతున్నానని చెప్పారు.

ఉగ్రవాదం అంతం కావాల్సిందే

ఉగ్రవాదం, ఉన్మాదం ఏరూపంలో ఉన్నా ఏ దేశంలో ఉన్నా ప్రపంచ మానవాళికి నష్టమే

భారత సైనిక పాటవానికి భారతీయుడిగా గర్విస్తున్నా

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): భారత సైన్యం ప్రదర్శించిన పాటవానికి ఒక భారతీయుడిగా గర్వపడుతున్నానని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తెలిపారు. ఉగ్రవాదం, ఉన్మాదం ఏరూపంలో ఉన్నా, ఏ దేశంలో ఉన్నా, ప్రపంచ మానవాళికి నష్టం కలిగించేదే తప్ప లాభం చేకూర్చేదికాదని పేర్కొన్నారు. 'ఉగ్రవాదం అంతం కావాల్సిందే. ఈ విషయంలో పాజిటివ్‌గా ఆలోచించే ప్రపంచ శక్తులన్నీ ఏకమై, ఉగ్రవాదాన్ని అంతమొందిస్తేనే శాంతి సామరస్యాలు నెలకొంటాయి. భారత సైన్యం ఎంత వీరోచితంగా దాడులు చేసిందో అంతే అప్రమత్తంగా ఉండి దేశరక్షణలో ఎవరికీ తీసిపోమన్నట్టుగా వారికి శక్తి సామర్థ్యాలుండాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నాను' అని పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

శభాష్ ఆర్మీ

ఆరేషన్ సిందూర్‌పై పార్టీలకు అతీతంగా ప్రశంసలు

సైన్యం పరాక్రమంపై పొగడ్తల జల్లు

న్యూఢిల్లీ: పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే), పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం చేసిన క్షిపణి దాడులపై పలువురు కేంద్ర మంత్రులు, రాజకీయ పార్టీలు, నాయకులు ప్రశంసలు కురిపించారు. సైన్యం పనితీరు, పరాక్రమాలను చూసి గర్విస్తున్నామని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌పై ఎవరేమన్నారంటే...

పహల్గాంలో అమాయక సోదరులను క్రూరంగా చంపిన ఘటనకు భారత్ ఇచ్చిన ప్రతిస్పందనే ఆపరేషన్ సిందూర్.

- అమిత్ షా, కేంద్ర హోం మంత్రి

మన అమాయకులను చంపిన వారిని మాత్రమే మేం చంపాం. మన చర్య చాలా వివేచనతో తీసుకున్నది. టెర్రరిస్టుల నైతిక స్థైర్యాన్ని దెబ్బ తీయడమే లక్ష్యంగా కేవలం వారి శిబిరాలపైనే దాడులు చేశాం.

- రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర రక్షణ మంత్రి

ఉగ్రవాదం పట్ల ప్రపంచం అస్సలు దయ చూపనే కూడదు.

- జైశంకర్, కేంద్ర విదేశాంగ మంత్రి

జాతీయ ఐక్యత, సంఘీభావం ప్రస్తుతం అవసరం. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ దృఢమైన జాతీయ విధానాన్ని కలిగి ఉంది.

- మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అధ్యక్షుడు

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్‌లో సైన్యానికి, దేశానికి తమిళనాడు అండగా, తోడుగా ఉంటుంది.

- స్టాలిన్, తమిళనాడు సీఎం

జైహింద్! జై ఇండియా!

- మమతా బెనర్జీ, పశ్చిమ బెంగాల్ సీఎం

దేశమంతా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిలబడింది. భారత సైన్యం శౌర్య పరాక్రమాలు దేశం మొత్తాన్ని గర్వించేలా చేశాయి.

- నితీశ్ కుమార్, బిహార్ సీఎం

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత సైన్యం చేస్తున్న ఈ పోరాటానికి 140 కోట్ల మంది భారతీయులు అండగా ఉంటారు. భారత్‌కు జయం.

- అరవింద్ కేజ్రీవాల్, ఆప్ జాతీయ కన్వీనర్

మరో పహల్గాం దాడి ఇంకెప్పుడూ జరగకుండా పాకిస్థాన్‌కు గట్టి గుణపాఠం నేర్పించాలి. ఆ దేశ ఉగ్రవాద మౌలిక సదుపాయాలను పూర్తిగా నాశనం చేయాలి. జై హింద్.

- అసదుద్దీన్ ఒవైసీ, ఏఐఎంఐఎం చీఫ్